క్లుప్తంగా

జీవాలు కనిపించడం లేదని ఫిర్యాదు

కోటబొమ్మాళి: తనకు చెందిన ఒక మేకపోతు, రెండు మేకలు ఏప్రిల్ నెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదని పట్టుపురం గ్రామానికి చెందిన తాన్ని సింహాచలం ఫిర్యాదు చేసినట్టు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. జగ్గయ్యపేట పొలంలో జీవాలు ఉండగా రాత్రి వేళలో పట్టుపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తనపై కక్షతో దొంగిలించి సమీపంలోని బావిలో పడేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మేకపోతు బావిలో చనిపోయి తేలుతూ కనిపించిందని బాధితుడు వివరించాడు.

చదువుపై ప్రత్యేక దృష్టిపెట్టాలి


ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న దృశ్యం

సోంపేట: విద్యార్థులు ఆట పాటలో పాటు విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇస్కలపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.లలిత అన్నారు. పాఠశాల 74వ వార్షికోత్సవ ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసి ఇటీవల పదోన్నతిపై బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు గార రాజేష్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


రుద్రయ్యను సన్మానిస్తున్న దృశ్యం

మందస: పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేసిన కె.రుద్రయ్య హరిపురం జెడ్పీహెచ్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఆదివారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రుద్రయ్య అందించిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ విశ్వనాథం, ఉపాధ్యాయులు సోమనాథ్, సింహాచలపతి, కరుణాకర్, భీమారావు పాల్గొన్నారు.

ఘనంగా బాల వికాస్ సంబరాలు


నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి బాలవికాస్ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సంస్థలు చేస్తున్న సేవల్లో అత్యంత ప్రధానమైనది విద్య విభాగమన్నారు. చదువుతో పాటు దైవభక్తి, ఇతర అంశాలు ప్రదర్శించడం గొప్పవిషయమన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు మాట్లాడుతూ జిల్లాలోని సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని బాలవికాస్ కేంద్రాల నుంచి చిన్నారులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రదర్శించిన నృత్యాలు, నృత్య రూపకాలు, క్విజ్ పోటీలు, ఆటల పోటీలు, బుర్రకథ, యోగా, వేద పఠనం తదితర కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.సురేంద్ర, రాష్ట్ర విద్యావిభాగం సమన్వయకర్త ప్రొఫెసర్ వి.శకుంతల, రాష్ట్ర ఐ.టి.ఇన్‌చార్జి ఆర్.కిషోర్, గ్రామసేవా ఇన్‌చార్జి సత్యనారాయణ, విద్యా జ్యోతి ఇన్‌చార్జి ఎస్.ఎస్.వి గురుప్రసాద్, యువజన సహ సమన్వయకర్త వి.కల్యాణి, గంగుల రమణబాబు, కిల్లాన ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని హడ్కో కాలనీకి చెందిన ఓ వివాహిత తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాస్ తెలిపారు. సంవత్సరం క్రితం సంతకవిటి మండలం వాసుదేవరపట్నం గ్రామానికి చెందిన పేకాన కృష్ణకు భవానితో వివాహమైంది. భవాని శ్రీకాకుళం ఓ డెంటల్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. కృష్ణ ఎలక్ట్రికల్ స్కూటీ షోరూంలో పనిచేస్తున్నాడు. ఈనెల 26న డ్యూటీకని వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోయిందని భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

● నేత్రపర్వంగా అమ్మవారి ఉత్సవాలు




సీహెచ్ కపాసుకుద్ది గ్రామ దేవత తోటమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం అర్ధరాత్రి అమ్మవారిని ప్రధాన ఆలయం నుంచి ఊర్లో నిర్ణయించిన ఉత్సవ పీఠస్థానానికి అంగరంగ వైభవంగా తీసుకువచ్చారు. ఉత్సవాల్లో తొలిరోజు అమ్మవారిని గ్రామవీధుల్లో ఊరేగించారు. బాణసంచా కాలుస్తూ.. యువత నృత్యం చేస్తూ మేళతాళాలతో బాజాభజంత్రీలతో కన్నులపండువగా అమ్మవారి ఊరేగింపు సాగింది. ఈ ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా వీధి నాటకాలు నిలిచాయి.

–కవిటి

భక్తులను అలరిస్తున్న మండపాలు



ఇచ్ఛాపురం పట్టణ ప్రజల ఇలవేల్పు.. స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇప్పటివరకు 50 దేవతామూర్తులతో కూడిన మండపాలను ఉత్సవ కమిటీ ప్రారంభించింది. వీటిలో మహాగణపతి, శ్రీకృష్ణుని గీతోపదేశం, కలకత్తా కాళీ, ఆదియోగి, ఉగ్ర నరసింహస్వామి మండపాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

ఇచ్ఛాపురం:





ఎమ్మెల్సీ రామారావుకు సత్కారం


ఎమ్మెల్సీ రామారావుకు సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: ఎమ్మెల్సీ నర్తు రామారావును కొత్తపుట్టుగలోని తన నివాసంలో అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్రాయి వాసుయాదవ్, ప్రగడపుట్టుగ గ్రామ కోనారి చందాన తేజేశ్వరరావు తదితర యాదవ సంఘం నేతలు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. రామారావుకు పుష్పగుచ్ఛాల్ని అందజేసి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా యాదవసామాజిక వర్గానికి సంబంధించిన పలు అంశాలను సంఘం నేతలు బదకల యర్రయ్య, లక్ష్మణమూర్తి, హరిప్రసాద్‌యాదవ్, కడియాల రాముడులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. వాటిని పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

శ్రీశ్రీ రచనలు సమాజానికి మేలుకొలుపులు


పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీశ్రీ రచనలు సమాజానికి మేలుకొలుపులని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి డాక్టర్ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ శ్రీశ్రీ సినీ సాహిత్యం, విప్లవ సాహిత్యంపై ప్రసంగించారు. గరిమెళ్ల విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి మాట్లాడుతూ నేటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా రచయితలు రచనలు కొనసాగించాలని కోరారు. అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు మాట్లాడుతూ సమాజ అధ్యయనం ద్వారా మంచి సందేశాన్ని అందించవచ్చన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జ్యోతి ఫెడ్రిక్, సీతంపేట డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ జీవన జ్యోతి, పాతపట్నం డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, వంశధార డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ బాబు, ప్రముఖ రచయిత పత్తి సుమతిలు మాట్లాడుతూ శ్రీశ్రీ భావాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం పత్తి సుమతి రచించిన 'నా కోడి- నా కుంపటి' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గురుగుబెల్లి లోకనాథం, తెరవే సభ్యులు ఉపేంద్రశర్మ, చింతాడ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కేశవరావు

మందస: కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు పొందర దేవేంద్ర, కె.కేశవరావు కోరారు. మందసలోని కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులంతా ఐక్యంగా ఉండాలన్నారు. మేడే సందర్భంగా పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి పలు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వాలు కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.దిలీప్‌కుమార్, సిందిరి వల్లభరావు, అల్లాడ కృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి రవాణా!


మట్టిని ట్రాక్టర్‌లోకి జేసీబీతో నింపుతున్న దృశ్యం

సంతబొమ్మాళి: మర్రిపాడు పంచాయతీ సెలగపేట ప్రాంత పొలాల నుంచి మట్టిని కొంతమంది అక్రమంగా రవాణా చేస్తున్నారు. రైతు పొలాలను చదును చేసే పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్లకు అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మర్రిపాడుకి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న నౌపడ గ్రామ పంచాయతీకి రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టిని తరలించుకుపోతున్నారు. మట్టిని తవ్వడానికి జేసీబీలను వినియోగిస్తున్నారు. మట్టి అక్రమంగా తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులంటున్నారు. మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

- నేత్రపర్వంగా శ్రీవారికి క్షీరాభిషేకాలు
- నారాయణ తిరుమలలో ఆధ్యాత్మిక శోభ

శ్రీకాకుళం కల్చరల్: ఉత్తరాంధ్ర తిరుమలగా పేరుగాంచిన పీఎన్ కాలనీలో నారాయణ తిరుమలలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గరుడ జెండాను ధ్వజ స్తంభం వద్ద ఉంచి పూజలు నిర్వహించి కల్యాణ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా శ్రీవారి విశ్వరూప దర్శనం, క్షీరాభిషేకాలు జరిగాయి. సాయంత్రం శ్రీవిష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ఉత్సవ సంకల్పం, ఆచార్య రుత్విగ్వరణ రక్షాబంధనలు నిర్వహించారు. మత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అంకురారోపణ, వాస్తు, యోగేశ్వర, నవబ్రహ్మ, గరుడ, మండపారాధనలు, భేరి పూజ, పతాక స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, ఆరాధనలు జరిగాయి.

ఘనంగా క్షీరాభిషేకాలు..

స్వామి వారి నిజరూప దర్శనం చేసుకుని భక్తులు పారవశ్యం చెందారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి నిజరూపాన్ని కనులారా వీక్షించి గోవింద నామస్మరణతో నిమగ్నమయ్యారు. పాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సంప్రదాయ పూజల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. కల్యాణోత్సవాలలో సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు పలువురు భక్తులు గోవింద మాలధారణలు చేశారు.


ధ్వజ స్తంభం వద్ద గరుడ జెండాను ఎగురవేస్తున్న అర్చకులు


స్వామివారికి క్షీరాభిషేకం

● ధర్మ ప్రచారం

ఊడికిలపాడు, కోటబొమ్మాళి విద్యుత్‌నగర్‌లో పోలాకి మండలం తలసముద్రం హిందూ జ్ఞానవేదిక కమిటీ ఆధ్వర్యంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. హిందూ ధర్మాన్ని ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు రాము, దన్వంతరి, రమేష్, గోవింద, సాయి, సతీష్, మహేష్, భాగ్యలక్ష్మి, జ్యోతి, పాల్గొన్నారు.

–కోటబొమ్మాళి



విద్యార్థినులకు అభినందన


విద్యార్థినులను సన్మానిస్తున్న దృశ్యం

మందస: వీరగున్నమ్మపురం పంచాయతీ పరిధిలోని కేజీబీవీ విద్యార్థినులు ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపారు. జిల్లాస్థాయిలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 23 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 25 మంది రాయగా 23 మంది పాసయ్యారు. ఓవరాల్‌గా శతశాతం ఉత్తీర్ణతా సాధించి.. జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించినట్టు ప్రిన్సిపాల్ రఘుపాత్రుని వాసంతి చెప్పారు. ప్రథమ సంవత్సరంలో పి.మహాలక్ష్మి 476 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో ఓ.ఈశ్వరి 944 మార్కులు సాధించించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసంతి, ఉపాధ్యాయులు అభినందించి, సన్మానించారు.

సందడిగా గరుడ వాహన సేవ


గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం


కోలాటం ఆడుతున్న చిన్నారులు

నందిగాం: పెంటూరులో వెలసిన వేంకటేశ్వర స్వామి గరుడ వాహన సేవ ఆదివారం సందడిగా సాగింది. ఆలయ 21వ వార్షికోత్సవంలో భాగంగా శాశ్వత ధర్మకర్త బొడ్డ జనార్దనరావు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, నిత్య ప్రోబోధిక, అష్టదిక్పాలకావాహన, గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణ, మంగళశాసనం, తీర్థప్రసాదగోష్ఠి తదితర విశేష పూజలు, విశేష అలంకరణతో శ్రీకూర్మం సాంస్కృతిక వేద పండితులు గోపి నంబాళ వేంకటదాసు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం రణస్థలం వారిచే కోలాటంతో గరుడ వాహన సేవ, భారీ ఊరేగింపు జరిగింది.

విశ్వనాథం మృతి ఉద్దానానికి తీరని లోటు


విశ్వనాథం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మాజీ ఎంపీ కణితి విశ్వనాథం మృతి ఉద్దాన ప్రాంతానికి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. గుళ్లలపాడు గ్రామంలో విశ్వనాథం సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బగాది శ్రీకాంత్, సోమేశ్వరరావు, గణేశ్వరరావు, దువ్వాడ ఉమామహేశ్వరరావు, జయరాం, భాస్కరరావు పాల్గొన్నారు.

విరిగిన స్తంభాలు

● నెట్ సేవలకు అంతరాయం


విరిగిన స్తంభం

కోటబొమ్మాళి: పాకివలస నుంచి కురుడు సచివాలయంతో పాటు గ్రామంలో ఇంటర్‌నెట్ సేవల కోసం ఏపీ ఫైబర్‌నెట్ సంస్థ స్తంభాలు, కేబుల్ లైన్‌ను గతంలో ఏర్పాటు చేసింది. అయితే ఫైబర్‌నెట్‌కు చెందిన నాలుగు స్తంభాలు ఇటీవల విరిగిపోయాయి. కారణం తెలియరాలేదు. దీంతో కేబుల్ కనెక్షన్ తెగిపోయి ఇంటర్ నెట్‌సేవలకు అంతరాయం ఏర్పడింది. కొత్తస్తంభాలను ఏర్పాటు చేసి ఇంటర్‌నెట్ సేవలను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



సుజాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వజ్రపుకొత్తూరు: విధి నిర్వహణలో చేసిన ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుందని యూఆర్‌కే పురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్ అన్నారు. ఉపాధ్యాయురాలు సుజాతను ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యాభివృద్ధి, సామాజిక సేవలతో అందరి అభిమానాన్ని ఆమె పొందారని కొనియడారు.

విద్యకు అధిక ప్రాధాన్యం


పాఠశాల ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

కంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఎం.ఎస్.పల్లిలోని పాఠశాల ముఖద్వారాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు వైఎస్సార్ కాంగ్రెస్ సర్కార్ హయాంలో అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొనపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాసు, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ లడ్డు కేశవ్ పాత్రో, గ్రామస్తులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.